నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 ఆదివారం 4 ఆగస్టు 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

● మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు

● లక్షెట్టిపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం

లక్షెట్టిపేట, ఆగస్టు 3 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ఐబీలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తెలంగాణ ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేస్తూ ముందంజలో ఉంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరిట చేసిన మోసాన్ని ప్రజలందరికీ తెలియజేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచేందుకు పట్టుదలతో పని చేయాలని సూచించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను కార్యర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, కౌన్సిలర్ చాతరాజు రాజన్న, పార్టీ మండల అధ్యక్షుడు చుంచు చిన్నయ్య, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు అంకతి గంగాధర్, నాయకులు గోళ్ల రవీందర్, ఆసాది పురుషోత్తం, కల్లు దావిద్, మోటపల్కుల శ్రీనివాస్, రాజిరెడ్డి, మారుతి, తిరుపతి, శ్రీకర్, మహేందర్‌రెడ్డి, చిప్పకుర్తి నారాయణ, ఉమాపతిరావు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న వ్యాపారులకు మద్దతు పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

## ఆక్రమణల తొలగింపు

● అడ్డుకుని ఆందోళనకు దిగిన వ్యాపారులు

● సమయమివ్వాలని వేడుకోలు.. ఆపై కలెక్టర్ వద్దకు..

● అండగా నిలిచిన బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్, ఆగస్టు 3 : పట్టణంలోని జడ్పీ బాలుర పాఠశాల ప్రహరీని ఆనుకుని నిర్మించిన ఆక్రమణలను శనివారం మున్సిపల్ అధికారులు తొలగిస్తుండగా, అందులో వ్యాపారాలు చేసుకుంటున్న వారంతా ఆందోళనకు దిగారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఒక్కసారిగా ఇక్కడి నుంచి తొలగిస్తే తమ బతుకులు ఆగమైపోతాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లాపాపలతో బైఠాయించి తమ దుకాణాలను తొలగించవద్దని మున్సిపల్ అధికారులు, పోలీసులను వారు వేడుకున్నారు. పొక్లెయిన్, ట్రాక్టర్లతో వచ్చిన మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లో ఆక్రమించుకొని వేసిన దుకాణాలను తొలగించాల్సిందేనని తేల్చిచెప్పగా, అందుకు వారు కొంత సమయమివ్వాలని కోరారు. ఈ మధ్యలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌తో మాట్లాడాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. వ్యాపారుల ఆందోళనకు బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, నాయకులు సుంకరి రమేశ్, తాజుద్దీన్, సీపీఐఎంఎల్ నాయకులు లాల్‌కుమార్ మద్దతు పలికారు. వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపించాకే ఇక్కడ నుంచి దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. కొన్నేళ్ల క్రితమే బస్టాండు పక్కన ఉన్న జడ్పీ బాలుర పాఠశాల ప్రహరీని ఆనుకుని పలువురు చిరువ్యాపారులు ఇనుపరేకులతో తయారుచేసిన షెడ్డులతో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. వీటిని తొలగించాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయం కూడా తీసుకుంది. ఆ మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతోనే పట్టణంలోని ఆక్రమణలను తొలగిస్తున్నట్లు టౌన్‌ప్లానింగ్ అధికారి సంపత్ తెలిపారు. టీపీఎస్‌లు శ్యాం, రాజ్‌కుమార్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

## స్త్రీనిధి అవకతవకలపై విచారణ



విచారణ చేస్తున్న అధికారులు

దండేపల్లి, ఆగస్టు 3 : మండలంలోని దివ్య వీవోలో స్త్రీనిధి రుణాల వసూళ్లలో జరిగిన అవకతవకలపై శ్రీలక్ష్మి మండల సమాఖ్య కార్యాలయంలో స్త్రీనిధి ఆర్ఎం వెంకటరమణ శనివారం విచారణ చేపట్టారు. వీవో పరిధిలో 103 మంది సభ్యులకుగాను రూ.55 లక్షల వరకు రుణాలు అందించారు. రుణాలు తీసుకున్న వారిలో కొందరు వాయిదాల ప్రకారం చెల్లిస్తూ వస్తున్నారు. ఇంకొందరు చెల్లించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. చెల్లించిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో చెల్లించనట్లుగా కనిపించింది. దీంతో కొందరు ఏపీఎం బ్రహ్మయ్య దృష్టికి తీసుకువచ్చారు.ఈ విషయం స్త్రీనిధి ఆర్ఎంకు తెలియడంతో దీనిపై విచారణ చేపట్టారు. త్వరలో వీవో సమావేశం ఏర్పాటు చేసి రుణాలు చెల్లించని వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. అవకతవకలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు అనిత, స్త్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ సితార, ఏపీఎం బ్రహ్మయ్య ఉన్నారు.

# పైసలు కడితేనే ఎల్ఆర్ఎస్

**ఫీజులు లేకుండా ఫ్రీగా పరిష్కరిస్తామని చెప్పి మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్**

● ఆగస్టులో మొదలుపెట్టి రానున్న మూడు నెలల్లో పూర్తి చేసేందుకు సన్నాహాలు ● ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కోట్ల రూపాయల వసూలుకు రంగం సిద్ధం

● ఉచితంగా చేస్తారని ఆశపడిన పేదలు, సామాన్యులకు భారంగా మారిన సర్కారు నిర్ణయం ● ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు మార్గదర్శకాలు జారీ

మంచిర్యాల, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు సర్కారు సిద్ధమైంది. ఎన్నికలకు ముందు అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చాక రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తూ అభాసుపాలవుతున్నది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) ఉచితంగా చేయాలంటూ నానా యాగీ చేశారు. అడ్డగోలు ప్రకటనలు ఇచ్చి జనాలను బోల్తా కొట్టించారు. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరిస్తామని ప్రకటనలు ఇచ్చారు. అప్పుడు కేసీఆర్ సర్కారు ఫీజు తీసుకుని క్రమబద్ధీకరణ చేస్తామని చెప్తే పేదలు, సామాన్యుల రక్తం తాగుతున్నారని, దీనిపై న్యాయ పోరాటం చేస్తామంటూ బీరాలు పలికారు. ఇప్పుడు సీన్ మారింది. అప్పుడు ఎల్ఆర్ఎస్ ఫ్రీ అన్న నేతలందరూ ఇప్పుడు మంత్రులయ్యారు. ఫీజులు లేకుండా ఉచితంగా చేస్తామన్న ఎల్ఆర్ఎస్‌పై మాట మార్చి ఇప్పుడు పైసలు కడితేనే ఎల్ఆర్ఎస్ చేస్తామంటున్నారు. ఎల్ఆర్ఎస్ పేరిట కోట్ల రూపాయల వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. పేదలు, సామాన్యులంటూ మొసలి కన్నీరు కార్చి ఇప్పుడు ఎల్ఆర్ఎస్ పేరిట రూ.25 వేల కోట్లు రాబట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 12 మున్సిపాలిటీల్లో 87 వేల దరఖాస్తులు ఎల్ఆర్ఎస్ కోసం వచ్చాయి. గ్రామ పంచాయతీల్లో వందలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిన్నింటినీ క్రమబద్ధీకరిస్తే కొన్ని కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరనున్నాయి. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం సంగతి ఎలా ఉన్నా.. మొన్నటి వరకు ఫ్రీగా ఎల్ఆర్ఎస్ చెస్తామని చెప్పి ఇప్పుడు ఫీజులు కట్టాల్సిందే నంటూ మాట మార్చడంతో పేదలు, సామాన్యులపై భారం పడనుంది.

### నాలుగేళ్లుగా ఎదురుచూపులు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎల్ఆర్ఎస్-2020 పేరిట గత సర్కారు దరఖాస్తులను స్వీకరించింది. నాలుగేళ్ల క్రితం ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలలపాటు ఓపెన్ ప్లాట్లు, నాన్ లే-అవుట్‌లకు సంబంధించి దరఖాస్తుదారులు రూ.1000 ఫీజు చెల్లించి డాక్యుమెంట్స్ సమర్పించారు. పెద్ద లే అవుట్‌లకు రూ.10 వేలు దరఖాస్తు ఫీజు తీసుకున్నారు. కొన్నింటిని పరిష్కరించగానే కోర్టు కేసులతో ప్రక్రియ నిలిచింది. దీంతో ఇప్పుడు కోట్ల రూపాయల ఆదాయమార్గంగా కనిపిస్తున్న ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ కన్ను పడింది. ఎట్టి పరిస్థితుల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పరిష్కరించాలంటూ అధికారులకు ఆదేశాలు వెళ్లాయి. అవసరమైతే వేరే డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వాడుకునేందుకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది.

### నాలుగు దశల్లో ప్రాసెస్..

తొలి దశలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సిస్టమ్ బేస్డ్ డేటాను అనుసరించి ఫిల్టర్ చేస్తారు. సర్వే నంబర్లవారీగా వాటిని క్లస్టర్లుగా డివైడ్ చేస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నా, కావాల్సిన డాక్యుమెంట్లు అన్నీ సమర్పించకపోయినా దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తారు.

- రెండో దశలో వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నీటిపారుదల శాఖ ఏఈ, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్, పంచాయతీ అధికారుల టీమ్ ఫీల్డ్ వెరిఫికేషన్ చేస్తుంది. వారికి మాత్రమే లాగిన్ ఉన్న యాప్‌లో సంబంధిత ఆస్తి నాలాలు, చెరువులు, కుంటలు, హెరిటేజ్ ప్రాపర్టీ, శిఖం, దేవాదాయ, ఇనాం భూములు, కోర్టు కేసుల్లో ఉన్నాయా లేదా పరిశీలించి అభ్యంతరాలుంటే నమోదు చేస్తారు.
- లెవల్-2లో అర్హత సాధించిన దరఖాస్తులను పరిశీలిస్తారు. సంబంధిత ప్లాట్ లేదా లే అవుట్‌కు రోడ్లు ఎంత వెడల్పుతో ఉన్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం చేశారా లేదా, ఓపెన్ స్పేస్ ఎంత ఉంది. తదితర సాంకేతిక అంశాలను వెరిఫై చేస్తారు. అన్ని కరెక్ట్‌గా ఉన్నాయని సీపీవో లేదా టీపీవో అధికారులు నిర్ధారిస్తారు. అనంతరం అవసరమైన పత్రాలు సమర్పించడంతోపాటు ఫీజు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తారు.
- చివరి దశలో అన్ని రకాల అర్హతలు సాధించిన దరఖాస్తులను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. మున్సిపల్ కమిషనర్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, అదనపు కలెక్టర్లు, కలెక్టర్ల స్థాయిలో తుది నిర్ణయం వెలువడుతుంది. క్రమబద్ధీకరించిన, రిజెక్ట్ చేసినా సిస్టమ్‌లో అవి ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతాయి. ఇలా నాలుగు దశల్లో ఎక్కడ జరగాల్సిన పని అక్కడ నిబంధనల ప్రకారం అయిపోతూ ఉంటుంది.



### మూడు నెలల్లో పూర్తి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మూడు నెలల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. 2020లో ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లు తీసుకున్నప్పుడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 87,021 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 36,239 అప్లికేషన్లను ప్రాసెస్ చేయగా 1838 రిజెక్ట్ అయ్యాయి. 11,094 దరఖాస్తులు షాట్‌ఫాల్ అయ్యాయి. 3363 దరఖాస్తులను ఫీజు చెల్లించాలంటూ లెటర్లు ఇచ్చారు. 127 అప్లికేషన్లకు ఫైనల్ అప్రూవుడ్ ప్రొసిడింగ్స్ ఇచ్చారు. వీటితో ప్రభుత్వానికి రూ.38,14,362 ఆదాయం వచ్చింది. ఇక వచ్చిన దరఖాస్తులన్నింటనీ పరిష్కరిస్తే కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానాకు చేరనున్నాయి.

**మున్సిపాలిటీల వారీగా 2020లో ఎల్ఆర్ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు..**

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు | ప్రాసెస్ చేసినవి | రిజెక్ట్ చేసినవి | షార్ట్‌ఫాల్స్ | ఫీజు చెల్లింపు లెటర్లు వచ్చినవి | ఫైనల్ అప్రూవల్ పొసిడింగ్స్ వచ్చినవి |
|---|---|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 19,430 | 7,448 | 17 | 2,781 | 1,847 | 63 |
| కాగజ్‌నగర్ | 1,850 | 1,801 | 15 | 1,565 | 170 | 28 |
| మంచిర్యాల | 23,301 | 9,224 | 1,589 | 835 | 354 | 13 |
| బెల్లంపల్లి | 415 | 411 | 6 | 81 | 284 | 2 |
| మందమర్రి | 22 | 17 | 13 | 2 | 0 | 0 |
| చెన్నూర్ | 1,321 | 1,309 | 6 | 660 | 24 | 4 |
| నస్పూర్ | 4,921 | 4,516 | 8 | 30 | 339 | 3 |
| క్యాతనపల్లి | 7,111 | 2,329 | 71 | 264 | 222 | 6 |
| లక్షెట్టిపేట | 2,163 | 564 | 11 | 108 | 6 | 0 |
| నిర్మల్ | 15,515 | 4,765 | 99 | 2,950 | 95 | 8 |
| బైంసా | 9,044 | 2,593 | 0 | 1,484 | 16 | 0 |
| ఖానాపూర్ | 1,928 | 1,262 | 3 | 334 | 6 | 0 |
| మొత్తం | 87,021 | 36,239 | 1,838 | 11,094 | 3,363 | 127 |

# నిధులున్నా నిర్లక్ష్యమేనా!

● జిల్లాలో అర్ధాంతరంగా నిలిచిన రోడ్ల నిర్మాణం ● కొత్త ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నా ప్రారంభంకాని పనులు

● రాకపోకలకు ప్రయాణికుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గతేడాది దాదాపు 55 కిలోమీటర్ల మేర 14 బీటీ రోడ్లు రెనివల్ చేసేందుకు రూ. 27 కోట్ల 68 లక్షలను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 7 రోడ్లకు రూ. 17.50 కోట్లు, సిర్పూర్ నియోజకవర్గంలో 7 రోడ్లుకు రూ. 10.18 కోట్లు మంజూరు చేసింది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని బూరుగూడ నుంచి చిలాటి గూడ వరకు బీటీ రెనివల్ కోసం రూ. 2.77 కోట్లు మంజూరు కాగా, పనులు ప్రారంభించి రూ. కోటీ 3 లక్షల బిల్లులు లేపుకొని అర్ధాంతరంగా వదిలేశారు. వట్టివాగు రోడ్ నుంచి కౌటాగూడ వరకు రూ. 1.53 కోట్లు మంజూరు కాగా, పనులు ప్రారంభించి రూ. 30 లక్షలు లేపుకొని పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మంజూరైన 7 రోడ్లలో రెండింటిని ప్రారంభించి అర్ధాంతరంగా ఆపేసిన కాంట్రాక్టర్లు మిగతా రోడ్లను ఇప్పటి వరకు ప్రారంభించనేలేదు. సిర్పూర్ నియోజకవర్గంలో ఏడాది క్రితం ప్రభుత్వం 7 బీటీ రోడ్ల నిర్మాణానికి రూ. 10.18 కోట్లు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు ప్రయాణానికి అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ అధికారులను సంప్రదించగా బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నాయని, త్వరగా పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అధ్వానంగా సాంగ్వీ-కర్పెతగూడ రోడ్డు

*ఇక్కడ కనిపిస్తున్నది కెరమెరి మండలం సాంగ్వీ నుంచి కర్పెత గూడకు వెళ్లే రోడ్డు (1.84 కిలోమీటర్లు). దీనిని బీటీ రోడ్డుగా మార్చేందుకు ఏడాది క్రితం అప్పటి ప్రభుత్వం రూ. 2.50 కోట్లు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి రూ.1.42 కోట్ల బిల్లులు కూడా లేపారు. ఆపై ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలవుతున్నా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు పూర్తయితే కర్పెత గూడతో పాటు రావుజీగూడ, ఖైరీ.. ఇంకా చిన్న చిన్న పల్లెలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుంది. సాంగ్వీ నుంచి కర్పెత గూడకు వెళ్లే మార్గంలో ఉన్న వాగుపై కూడా వంతెన సౌకర్యం కలుగుతుంది. కానీ, అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డు నిర్మాణం అర్ధాంతరంగా నిలిచి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.*



కొండపల్లి-రెబ్బన రోడ్డు దుస్థితి

*ఈ చిత్రంలో కనిపిస్తున్నది పెంచికల్‌పేట్ మండలంలోని రెబ్బన నుంచి కొండపల్లి మీదుగా లోడ్పల్లి గ్రామం వరకు వెళ్లే రోడ్డు. ఈ ఐదు కిలోమీటర్ల బీటీ రోడ్డును రెనివల్ చేసేందుకు రూ. 2.70 కోట్లు వెచ్చించారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గుంతలు పడ్డాయి. రోడుకు ఇరువైపులా కొట్టుకుపోయింది. లోడ్పల్లి, కొండపల్లి గ్రామాలతో పాటు గొల్లవాడ, జైహింద్‌పూర్ గ్రామాలకు వెళ్లే ఈ రోడ్డు గుంతలమయంగా మారింది.*

### రోడ్డుతో నరకం చూస్తున్నం

*సాంగ్వీ గ్రామం మీదుగా కర్పెత గూడ వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. ప్రయాణించాలి అంటే నరకం అనుభవించాల్సి వస్తున్నది. ఈ రోడ్డు మంచిగ చేస్తే కర్పెత గూడతో పాటు రావుజీ గూడ, ఖైరీ గ్రామంతో పాటు చిన్న చిన్న పల్లెలకు రాకపోకలకు ఇబ్బంది ఉండదు. కర్పెత గూడ వాగు వద్ద వంతెన నిర్మాణం కోసం ఏడాది కింద పిల్లర్లు వేసి వదిలేసిన్రు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలి.* **- నికోడే వసంత్‌రావు, సాంగ్వీ, కెరమెరి మండలం**





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అధికారులు

## ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలి

**ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

నస్పూర్/ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 3 : లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ లే అవుట్‌ల క్రమబద్ధీకరణ పథకం ద్వారా అందిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. అనంతరం కలెక్టర్ దీపక్ కుమార్ జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్, మున్సిపల్ కమిషనర్‌లతో మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ పథకంలో అందిన దరఖాస్తుల పరిశీలన సమర్థవంతగా నిర్వహించాలన్నారు. ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే మాట్లాడుతూ లేఅవుట్ ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ ద్వారా మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో వచ్చిన దరఖాస్తులను ప్రత్యేక కమిటీల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ఆర్డీవోలు లోకేశ్వర్ రావు, కాసబోయిన సురేశ్, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

• జన్మదిన శుభాకాంక్షలు
• పొలిటికల్
• స్వదేశాగమనం
• లీగల్ ప్రకటనలు
• క్లాసిఫైడ్స్
• పదవీ విరమణ
• ప్రారంభోత్సవం
• శ్రద్ధాంజలి
• సినిమా
• వివాహ మహోత్సవం
• షష్టిపూర్తి మహోత్సవం
మరియు
• అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679